టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డీఎంగా కృష్ణారెడ్డి



రాజేంద్రనగర్: టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో మేనేజర్‌గా బి.కృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా పని చేసిన వేణుగోపాల్‌ను హైదరాబాద్–1 డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న కృష్ణారెడ్డిని రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిపో కార్మికులు, అధికారులు కృష్ణారెడ్డికి ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌టీఐ సుశీల, మెకానికల్ ఇంజనీర్ నీలిమ, స్వరూప, డిప్యూటీ సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, అనంతయ్య పాల్గొన్నారు.

ప్రపంచ తలసీమియా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న బాధిత చిన్నారులు

రాజేంద్రనగర్: తలసీమియా అండ్ సికెల్ సెల్ సొసైటీ గురువారం ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని శివరాంపల్లిలోని ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వైద్య సిబ్బంది రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో కలిశారు. తెలంగాణలో తలసీమియా నిర్మూలనకు సహకరించాలని కోరారు.

పూడికతీత పనులు చేపట్టాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో వర్షపు నీటి పైప్‌లైన్‌లకు పూడికతీత పనులు చేపట్టాలని నియోజకవర్గం గుడ్ గవర్నెన్స్ కమిటీ వారు బల్దియా జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు గురువారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి, బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసూదన్ మాట్లాడుతూ..వరద నీటి పైప్ లైన్‌లు పూడికలతో నిండిపోయాయన్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులపై సైతం డ్రైనేజీ నీరు ప్రవహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మనీష్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని టీజీఎస్‌ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి తెలిపారు. ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. క్రమం తప్పకుండా తాము నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రయాణికులు, వ్యాపారులు, కాలనీ సంక్షేమ సంఘాల నుంచి మంచి స్పందన వస్తుందని అన్నారు. తమకు వస్తున్న సలహాలు, సూచనలను పరిశీలించి వివిధ రూట్‌లలో కొత్త బస్సు సర్వీసులు వేయడంతో పాటు పలు రూట్‌లలో బస్సు సర్వీస్ సంఖ్యను పెంచడం జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోన్: 99592 26133లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కళాశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలి

సుల్తాన్‌బజార్: నానాటికి విద్యారంగంలో మాతృభాషపై నిరాదరణ, ఆంగ్ల ఆధిపత్యం పెరిగిపోతున్న నేపథ్యంలో 82 ఏళ్ల కింద మాతృభాష తెలుగు పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా ఆవిర్భవించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు ఆమోదించింది. ఇంటర్మీడియెట్‌లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను విరమించుకోవడమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి అధ్యయనాంశంగా జీఓ నెంబరు:15 ప్రకారం కచ్చితంగా అమలు చేస్తున్నట్లే ఇంటర్‌లో కూడా తెలుగును తప్పనిసరి చేయాలని కోరింది. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సమన్వయ కర్తగా వ్యవహరించారు.

తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ

గోల్కొండ: తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కూ పడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండజాలదని ఆమె అన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే బీజేపీ లక్ష్యమని స్పష్టం చేశారు.





సులేమాన్‌నగర్‌లోని చింతల్‌మెట్ బస్తీలో ప్రమాదకరంగా ఉన్న రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌లు

ప్రాణాంతక ట్రాన్స్‌ఫార్మర్లు!

- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌లతో నిత్యం ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టని వైనం
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



విద్యుదాఘాతంతో మృతిచెందిన ఆవు (ఫైల్)



శాస్త్రిపురం: కనీస రక్షణ చర్యలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. చుట్టూ కంచెలను నిర్మించాలని బాధితులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు చేస్తున్న విజ్ఞప్తులు బూడిదలో పోసిన పన్నీటి చందాన తయారవుతున్నాయి.

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలో చాలా ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మ్‌లకు కంచెలు లేవు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.
- ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో చాలా ప్రాంతాల్లో స్థానికులే పరదాలు, కర్రలు అడ్డం పెట్టి ప్రమాదాలు జరగకుండా చూసుకుంటున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్లను నిర్మించేటప్పుడే రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు అధికారులపై దుమ్మెత్తి పోస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లవైపు వెళ్లాలంటేనే స్థానికులు భయపడుతున్నారు.
- బస్తీ రహదారుల్లో చిన్నారులు ఆడుకునే ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. సర్కిల్ పరిధిలోని చింతల్‌మెట్, సులేమాన్‌నగర్, వీరన్నకుంట, ఎంఎంపహాడీ, నౌనంబర్ తదితర ప్రాంతాలలో టాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి.

వ్యర్థాలకు నిలయంగా...

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు లేకపోవడంతో ఆయా ప్రాంతాలు చెత్త ఇతర వ్యర్థాలకు నిలయంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విపరీతంగా చెత్తాచెదారాన్ని వేస్తున్నారు. దీంతో వాటి పరిసర ప్రాంతాల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచం లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది సైతం చెత్తను తొలగించడానికి భయపడుతున్నారు.

- మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వచ్చి ప్రాణాలను పోగొట్టుకుంటున్నాయి. గతంలో రాజేంద్రనగర్ బస్తీల్లో ఆవులు, గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటనలు చాలానే ఉన్నాయి.

వేలాడుతున్న విద్యుత్ తీగలు...

ట్రాన్స్‌ఫార్మర్ల పక్కనే ఉన్న ఫ్యూజ్ బాక్సు నుంచి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఫ్యూజ్ బాక్సులకు సరఫరా అయ్యే విద్యుత్ తీగలు వేలాడుతూ చిన్నారులకు సైతం అందే ఎత్తులో ఉన్నాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రెండు, మూడు ఫ్యూజ్‌బాక్సులు ఉండి వాటి నుంచి సరఫరా జరిగే విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి.

- సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ట్రాన్స్‌ఫార్మ్‌లకు కంచెలను ఏర్పాటు చేయాలని చెప్పినా స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నోటీసులివ్వకుండా సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు దారుణం

రాజేంద్రనగర్: ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ పోలీసులు 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించి భయభ్రాంతులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీయూడబ్ల్యూజే రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు మేకల దామోదర్‌రెడ్డి తెలిపారు. విజయవాడలోని ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు ప్రవేశించి విచారణ పేరిట సోదాలు చేసి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. పత్రికాపరంగా ఎలాంటి వార్తలు వచ్చినా వాటిని ఖండించాలని లేదా ప్రెస్ కౌన్సిల్ తదితర సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయపరంగా వ్యవహరించాలే తప్ప పోలీసులు కక్షపూరితంగా వేధించడం తగదన్నారు. ఒక దినపత్రిక ఎడిటర్ పట్ల పోలీసులు వ్యవహరించి తీరు సరైంది కాదన్నారు. ఈ తరహా ఘటనలు పత్రికారంగ చరిత్రలో ఇదే మొదటిదని.. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రామంజాపూర్‌తండాకు నీటి సరఫరా షురూ

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్ రూరల్: తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్న రామంజాపూర్‌తండాకు నీటి సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 7న 'తాగునీటికి కటకట' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. రామంజాపూర్‌లోని సంపు నుంచి తండాలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులోకి నీటి సరఫరా చేపట్టారు. అక్కడి నుంచి ఇంటింటి నల్లాకు నీటి సరఫరా కొనసాగించారు. ఇదిలా ఉండగా.. తండాలోని మినీ ట్యాంకులకు నీటి సరఫరా చేసే బోరు మోటారుకు మరమ్మతులు చేపడతామని ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ తెలిపారు. మోటారు మరమ్మతులు లేదా బోరు ఫ్లషింగ్‌ను శుక్రవారం చేపడతామని స్పష్టం చేశారు.



ఓవర్‌హెడ్ ట్యాంకులో నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ఏఈ

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయరా?



బురదమయంగా మారిన రోడ్డు

మణికొండ: మున్సిపాలిటీకి సకాలంలో పన్నులు చెల్లించినా తమ కాలనీకి కనీస సౌకర్యాలను కల్పించటంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం అవుతున్నారని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలోని అన్ని రోడ్లలలో నివాసాలను ఏర్పాటు చేసుకుని ప్రజలు జీవిస్తున్నారు. వారికి కనీస అవసరాలైన రోడ్లు, వీధి దీపాలు, మురుగునీటి కాలువల నిర్మాణం, మంచి నీటి సౌకర్యం కల్పించటం లేదని శ్రీనాథ ఎక్లేవ్, కోరల్ రెసిడెన్సీ, గోల్డన్ కీ, మణికంఠ రెసిడెన్సీ, ఆర్ 7 ఇన్నా, ఆరక రెసిడెన్సీ, రాజరాజేశ్వర రెసిడెన్సీ, డీఎఫ్ అపార్ట్‌మెంట్‌వాసులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇంటి పన్నులు చెల్లిస్తున్నా తమకు సౌకర్యాలు ఎందుకు కల్పించరని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు తిరగని కాలనీల్లో రోడ్లు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తున్న అధికారులు, ప్రజలు నివసిస్తున్న వాటిని ఎందుకు పట్టించుకోరని వారు నిలదీస్తున్నారు. అనేక సార్లు మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదులు చేసినా చలనం లేదని, ఇకనైనా స్పందించి రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. లేదంటే మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

'మా స్కూల్‌లో మీ పిల్లలను చేర్పించండి'

- ప్రైవేటు పాఠశాలల ముమ్మర ప్రచారం
- తల్లిదండ్రులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉపాధ్యాయులు

శాస్త్రిపురం: 'అమ్మా మీ ఇంట్లో ఎవరైనా చిన్న పిల్లలు ఉన్నారా.. ఉంటే ఎక్కడ చదువుతున్నారు. మా పాఠశాలలో చేర్పించండి.. మంచి విద్యాబోధనతోపాటు ఫీజులో రాయితీ కూడా ఇస్తాము' అని గడచిన వారం రోజులుగా రాజేంద్రనగర్ సర్కిల్ బస్తీలలో ప్రైవేటు పాఠశాలల టీచర్లు చిన్నారుల కోసం వేట సాగిస్తున్నారు. సర్కిల్ పరిధిలో వందకుపైగా చిన్న చితక ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వేసవి సెలవులు కావడంతో టీచర్లు అందరూ చిన్నారులను తమ పాఠశాలలో చేర్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పాఠశాలల యాజమాన్యాలు టీచర్లకు టార్గెట్‌లు విధిస్తుండటం, విద్యార్థులను చేర్పిస్తేనే జీతాలు ఇస్తామని యాజమాన్యాలు హుకుం జారీ చేస్తుండటంతో టీచర్లు ఉదయం 8 గంటల వరకు బస్తీలలో ప్రత్యక్షమై తమ పాఠశాలలో చిన్నారులను చేర్చుకునేందుకు చిన్నారుల తల్లితండ్రులను ప్రసన్నం చేసుకుంటున్నారు. చిన్నారులను తమ పాఠశాలలో చేర్పిస్తేనే తమ ఉద్యోగాలు ఉంటాయని కొంతమంది ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తూ చిన్నారుల అడ్మిషన్‌ల కోసం ప్రయత్నిస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అడ్మిషన్‌లు బాగానే జరుగుతున్నాయని కార్పొరేట్ పాఠశాలల నుంచి కూడా విద్యార్థులను తల్లితండ్రులు సాధారణ కాన్వెంట్‌లలో చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారని టీచర్లు చెబుతున్నారు.

11న బొటానికల్ గార్డెన్ బర్డ్ వాక్

గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 11న బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్ నిర్వహిస్తున్నట్లు టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బర్డ్ వాక్ కొనసాగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పక్షుల జాతులను గుర్తించడం, ఏ పక్షులు ఏ వాతావరణంలో, ఏ రకమైన వృక్షాలపై గూళ్లు కడతాయి, ఎలాంటి ఆహారం తీసుకుంటాయి, ఎలా కదులుతాయి, వాటి ప్రవర్తన ఉంటుందో పక్షి నిపుణులు వివరిస్తారని పేర్కొన్నారు. బర్డ్ వాక్ రావాలనుకునే వారు 9885298980, 7382307476 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నీటి అక్రమ వ్యాపారానికి చెక్

గోల్కొండ: టోలిచౌకీ ఎండిలైన్స్ శాతం పహాడ్ బస్తీలో అక్రమంగా నీటి వ్యాపారం కొనసాగిస్తున్న ఓ బోర్‌ను అధికారులు సీజ్ చేశారు. నదీమ్ కాలనీని ఆనుకొని ఉన్న శాతం చెరువు ఎగువ ప్రాంతంలో శాతం పహాడ్ బస్తీ ఉంది. అయితే స్థానికంగా ఉండే ఓ వ్యక్తి తమ ఇంటి వద్ద బోరు వేసుకొని ట్యాంకర్ల ద్వారా అక్రమంగా నీటి వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఈ బోరు నుంచి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ట్యాంకర్లతో నీరు తోడడం వల్ల శాతం పహాడ్ బస్తీలోని ఇతర బోర్లల్లో నీటి చుక్క లేకుండాపోయింది. దీంతో స్థానికులు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ దృష్టికి తెచ్చారు. ఆయన సూచనల మేరకు గోల్కొండ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదు స్వీకరించిన తహసీల్దార్ తన సిబ్బందితో శాతం పహాడ్‌కు వచ్చి బోరును సీజ్ చేశారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



హేమంత్‌బోర్కడేతో మాట్లాడుతున్న గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడి జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడేను కోరారు.గురువారం జోనల్ కార్యాలయంలో ఆయనను కలిసి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వివరించారు. అంతేకాకుండా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. గచ్చిబౌలి డివిజన్‌లో చెరువుల అభివృద్ధి, పార్కుల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు వంటి అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు మెరుగుపర్చడంలో పూర్తిగా సహకరించాలని కోరారు.

సాతంరాయిలో సందడిగా 'బడిబాట'



సాతంరాయి రాజీవ్‌గృహకల్పలో విద్యార్థులను చేర్చుకునేందుకు వెళ్లిన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఈవో సుశీందర్‌రావు

- సర్కారు బడుల్లో చిన్నారులను చేర్పించండి
- ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐపై విద్యార్థులకు అవగాహన
- జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు

శంషాబాద్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు గురువారం ఉదయం మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేరిపించాలని తల్లిదండ్రులకు ఒప్పించారు. ఇందులో భాగంగా సుమారు వంద మంది విద్యార్థులను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్చారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనతో పాటు మధ్యాహ్న భోజన వసతి ఉంటుందని వివరించారు.

- ఈ ఏడాది నుంచి పాఠశాలల్లో ఏఐపై అవగాహన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు సూచించారు. ఉపాధ్యాయులతో ఆయన బడిబాటపై స్థానిక పాఠశాలలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు.

మీరాలం పార్కు అభివృద్ధికి కృషి: జెడ్‌సీ



మీరాలం పార్కులో పర్యటిస్తున్న జెడ్‌సీ వెంకన్న

శాస్త్రిపురం: మీరాలం చెరువు పార్కులో సౌకర్యాలను కల్పిస్తామని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. గురువారం ఉదయం ఆయన శాసనమండలి సభ్యుడు మీర్జారహ్మత్ బేగ్‌తో కలిసి సులేమాన్‌నగర్ డివిజన్ మీరాలం చెరువు పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు, వాకర్‌లు పార్కు అభివృద్ధిపై కమిషనర్‌కు పలు ఫిర్యాదులు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, పార్కు వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలుస్తోందని దీంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పార్కులో ఓపన్ జిమ్ సామగ్రిని ఏర్పాటు చేయాలని కోరారు. పార్కుకు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన జెడ్‌సీ మాట్లాడుతూ... త్వరలో ఆయా సమస్యలను పరిష్కారస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ అబేదాసుల్తానా నవాజుద్దీన్, స్థానిక నేతలు తాహేర్, జహంగీర్, శాబార్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీల ఏర్పాటుపై పరిశీలన



డ్రైనేజీలపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. వైష్ణవి ఒవైసీస్ నుంచి ఇసా రివర్ వరకు నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు కోసం జలమండలి అధికారులతో కలిసి ఆయన సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం అధునాతన పద్ధతిలో పనులను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సైతం సహకరించాలని కోరారు. మున్సిపల్ డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, జీఎం సాయి లక్ష్మీ, డీజీఎం, మేనేజర్ సార్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

అత్తాపూర్: అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. గురువారం అత్తాపూర్ డివిజన్ నందిముస్లాయిగూడ సాయినగర్‌లోని రాముల వారి గుడి వద్ద రూ. 7.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. రోడ్లు పూర్తిగా గోతులమయంగా కావడంతో సమస్యను తన దృష్టికి తెచ్చారన్నారు. వెంటనే అధికారులతో చర్చించి సీసీ రోడ్డు పనుల కోసం నిధులు మంజూరు చేయించామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తు పనులను చేపట్టాలని నాణ్యత లోపిస్తే సహించమని స్పష్టం చేశారు. డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్, వాసు, వెంకట్‌రెడ్డి, రాజు, విజయ్, స్వామి, శశికాంత్‌శర్మ, గణేష్, రాంబాబుగౌడ్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు చక్కటి చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సింగ్స్ ఐవేర్, చంద్రశేఖర్ ఆజాద్ ఆప్టొమెట్రిస్ట్ ఆధ్వర్యంలో మహవీర్ కళాశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి అద్దాలను పంపిణీ చేశామన్నారు. ఉచితంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినందుకు సింగ్స్ ఐవేర్, చంద్రశేఖర్ ఆజాద్ ఆప్టొమెట్రిస్ట్ ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషాశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వీరేంద్రపాటిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలు సర్టిఫికెట్లు అందిస్తున్న రామకృష్ణ

గచ్చిబౌలి: వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ తీసుకుంటే మహిళలు స్వయం ఉపాధికి అవకాశం ఉంటుందని టీజీఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ పేర్కొన్నారు. కొండాపూర్ బెటాలియన్‌లో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెస్ మేకింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ తీసుకున్న వారికి స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కొండాపూర్ బెటాలియన్ క్యాంపస్‌లో చేపడుతున్న శిక్షణ తరగతులను సమీప ప్రాంతాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ రాంమోహన్, కమాండెంట్ సతీమణి సంధ్యారాణి పాల్గొన్నారు.